క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం



క్రోసూరు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ఎదుట సీఈవో కాకర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలన్నీ కంప్యూటరీకరణ చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, విధులు పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. సొసైటీల ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సొసైటీ మరిన్ని సేవలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో శనివారం 32 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 31,01,938 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. పట్టణంలోని 20వ వార్డులో కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు షేక్ మస్తానవలి, చౌటా శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం



సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పట్టణంలోని నాలుగు కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. మొదటి బెంచ్‌కు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్ కుమార్ రెడ్డి, సభ్యుడిగా బొమ్మిశెట్టి శ్రీనివాసరావు వ్యవహరించారు. రెండో బెంచ్‌కు సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిఫ్ హుస్సేన్, సభ్యుడిగా పాటిబండ్ల రవి, మూడో బెంచ్‌కు ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి. ప్రియదర్శని, సభ్యుడిగా ఆకుల నాగార్జున వ్యవహరించారు. నాలుగో బెంచ్‌కు రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జె. సుజిన్ కుమార్, సభ్యుడిగా కంబాల అనిల్ కుమార్ వ్యవహరించారు. నాలుగు కోర్టుల పరిధిలో సివిల్- 85, క్రిమినల్ – 780, ప్రీలిటికేషన్ –3 కలిపి 868 కేసులకు గానూ రూ.2,40,88,097 చేతులు మారాయి. కార్యక్రమాల్లో న్యాయ వాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం



అచ్చంపేట: స్వయంకృషితో ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆసరాగా నిలిచింది. హైదరాబాద్ సురభి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న జరుపుల అరవిందన్ నాయక్‌కు హాస్టల్ ఫీజు నిమిత్తం ఫౌండేషన్ నిర్వాహకులు అచ్చంపేట సీఐ పోలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం రూ.40000 అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని సీఐ అభినందించారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి స్నేహ హస్తాలు లాంటి సేవా సంస్థలు తోడ్పడటం అభినందనీయమని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరీముల్లాబాబు మాట్లాడుతూ విద్యార్థి హాస్టల్ ఫీజు గత నాలుగు సంవత్సరాలుగా ఏడాదికి రూ.40వేలు చొప్పున రూ.1,60,000 ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మన్న భద్రయ్య, తుమ్మా శౌర్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన వ్యక్తి అరెస్టు

అమరావతి: మండల పరిధిలోని మునుగోడులో కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన వ్యక్తిని శనివారం అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ అచ్చియ్య మాట్లాడుతూ మునుగోడులో విధులు నిర్వహణకు వెళ్లిన కానిస్టేబుల్ రత్నబాబును కారుతో ఢీకొట్టి గాయపరచిన కొలికొండ వెంకటరావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

స్టేడియం పేరుపై టీడీపీలో సిగపట్లు

- ఎమ్మెల్యే కన్నా పేరు పెట్టాలంటూ ఒక వర్గం
- కాదు మాజీ స్పీకర్ కోడెల పేరు పెట్టాలని మరో వర్గం
- స్టేడియం ప్రారంభ కార్యక్రమం వాయిదా పడే అవకాశం



పట్టణంలోని స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: టీడీపీలో పేరుపై సిగపట్లు తప్పడం లేదు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో స్టేడియం నిర్మాణం అప్పటి శాసనసభ్యుడు, మాజీ స్పీకర్ స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాం లో ప్రారంభమైంది. చివరి దశలో ఉన్న సమయంలో నిధులు మంజూరు కాకపోవడంతో అర్ధంతరంగా ఆగిపోయింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రస్తుత శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రయత్నాలు చేపట్టారు. ఏడాదిలో పలు మార్లు ఆయన పరిశీలన కూడా చేశాయి. అయితే ప్రారంభోత్సవం ఇదిగో..అదిగో అంటూ వాయిదాలు పడుతూ వచ్చింది. ఏడాదిలో చేసింది ఏదైనా చూపాలంటే ప్రస్తుతం స్టేడియం నిర్మాణం మాత్రమే కనిపిస్తోంది.

9న ప్రారంభించేందుకు సన్నాహాలు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న క్రీడల శాఖ మంత్రిని ఆహ్వానించి ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం స్టేడియాన్ని స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ నాయకులతో కలిసి పరిశీలించారు. అయితే, స్టేడియానికి పేరు పెట్టడంపై వివాదం నెలకొంది. ప్రస్తుత శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పేరు పెట్టాలని ఒక వర్గం ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా .. కాదు స్టేడియం నిర్మాణం చేపట్టింది స్వర్గీయ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని, ఆయన పేరే పెట్టాలంటూ టీడీపీలోని మరో వర్గం బయటకు వచ్చింది. ఇప్పటికే పట్టణంలోని 4వ వార్డ్ కౌన్సిలర్, టీడీపీ పట్టణ తాజా మాజీ అధ్యక్షుడు కటకం రామకృష్ణ స్టేడియానికి శివప్రసాదరావు పేరు పెట్టాలని పట్టుబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేరును వ్యతిరేకిస్తూ ఈ నెల 30న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రకటించమే కాకుండా అధికారులకు లిఖితపూర్వకంగా డీసెంట్ సైతం ఇచ్చాడు. దీంతో ఒక వర్గం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేరును, మరో వర్గం స్వర్గీయ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద రావు పేరును ప్రస్తావిస్తూ తెర పైకి రావడంతో స్టేడియం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేసే ఆలోచనలో పాలకులు ఉన్నట్లు తెలుస్తోంది.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: గ్రామాలను అభివృద్ధి పథంలో నడపించడమే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పని చేయకుండా ఉన్న బోర్లను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తున్న గ్రామాల్లో పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ నాయక్, డెప్యూటీ తహసీల్దార్ అరుణాదేవి, ఎంపీటీసీ సభ్యులు మర్రి శ్రీనివాస రెడ్డి, చిట్టింశెట్టి శివనాగమణి, రేగులగడ్డ తిరుపతమ్మ, కో–ఆప్షన్ మెంబర్ దరియా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు ముగిసిన శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: సాధికారత, అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మూడు రోజులుగా నాలుగు మండలాల మహిళా సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఉమెన్ ఎంపవర్‌మెంటు, గ్రామ పంచాయతీలు పరిపాలనలో మహిళా సర్పంచుల పాత్రపై శిక్షణ ఇచ్చారు. సత్తెనపల్లి, రాజుపాలెం, పిడుగు రాళ్ల, పెదకూరపాడు మండలాల నుంచి 40 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాస్‌రెడ్డి, డెప్యూటీ ఎంపీడీవో ఏ. శ్రీనివాసరెడ్డి, ట్రెనింగ్ డెప్యూటీ ఎంపీడీవో పూర్ణచంద్రరావు, రూపవతి, రుద్రవరం, మాచవరం పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదులో జాగ్రత్త అవసరం

పెదకూరపాడు: ఓటర్ నమోదులో జాగ్రత్తలు పాటించాలని పెదకూరపాడు నియోజకవర్గ అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బెల్లంకొండ మండలంలోని బూత్‌స్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. బూత్ లెవెల్ అధికారుల విధులు, రాజ్యాంగ నిబంధనలు, ఓటర్ నమోదు, ఓటరుతో ప్రవర్తన, సంభాషణ, ఫామ్ 6,7,8 పూర్తి, బీఎల్‌ఓ యాప్‌పై రిసోర్స్ పర్సన్‌లు షేక్ న్యామతుల్లా, రాము శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మి, అచ్చంపేట తహసీల్దార్ ఎస్.సరోజ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి



ప్రసన్నాంజనేయునికి పూజలు చేస్తున్న నేతలు

బెల్లంకొండ: గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో పని చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి నర్సిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కోళ్లూరు ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పార్టీ మండల సమావేశంలో మాట్లాడుతూ విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభివృద్ధి కోసం కలిసిమెలిసి పనిచేయాలని కోరారు. త్వరలో గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ అసమర్థ పాలన, హామీలను అమలు చేయకపోవడంపై పార్టీ తరఫున పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయి రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షులు మౌలాలి, గాలం రామకృష్ణ, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ భద్రయ్య, సర్పంచులు నరసింహ నాయక్, కంభంపాటి పాప, దారం రమణారెడ్డి, బద్దూరి శేషిరెడ్డి, వెంకట సైదయ్య, బాబూజీ, ఎంపీటీసీ సభ్యులు మర్రి శ్రీనివాసరెడ్డి, రేగులగడ్డ శ్రీను, గడిపర్తి చినబాబు, రామాంజనేయులు నాయక్, మేకల వెంకటేశ్వర్లు, సిరిపురం మేస్త్రి, గమిడి కోటినాగయ్య పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకటరావు, సిబ్బంది

బెల్లంకొండ: ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఐ.వెంకటరావు తెలిపారు. శనివారం మండలంలోని పాపాయపాలెంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ , అవగాహన సదస్సును నిర్వహించారు. ఉద్యాన శాఖ, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో నిర్వహించిన సదస్సులో ఉద్యాన శాఖాధికారి మాట్లాడారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేసుకోవడానికి గుర్తించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా పాపాయపాలెంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఐదు ఎకరాల్లో శనివారం ప్లాంటేషన్ చేశారని చెప్పారు. సాగు ప్రోత్సాహంలో భాగంగా హెక్టారుకు 50 శాతం రాయితీపై నాలుగు సంవత్సరాల గాను 21,000 మించకుండా ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతర పంట సాగుకై నాలుగు సంవత్సరాల గానూ 21,000 రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫీల్డ్ స్టాఫ్ రవి, పిడుగురాళ్ల డివిజన్ ఉద్యాన అధికారి ఎం.అంజలీబాయి మాట్లాడుతూ సరాసరిగా ఆయిల్ పామ్ సాగు వల్ల ఎకరానికి నికరంగా రూ.లక్ష పైన ఆదాయం మిగులుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు మాటూరి వంశీ, రజని, సిబ్బంది నరేంద్ర, శ్యామ్ ప్రసాద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాజుపాలెం: జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని పశుసంవర్ధకశాఖ ఏడీఏ వీరయ్య తెలిపారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, గుర్రాలు, పందులు, పిల్లులు, పక్షులు, ఎలుకల నుంచి వ్యాధులు మనుష్యులకు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. పిచ్చికుక్క కాటుకు యాంటీ రేబిస్ టీకాను కనుగొన్న జూలై 6ను జూనోసిస్ డేగా నిర్వహిస్తామని చెప్పారు. పెంపుడు కుక్కలు, పిల్లులకు పశువుల డాక్టర్ సలహా మేరకు టీకాలు వాడాలని ఆయన సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, జబ్బు పడిన పశువులను తాకిన వెంటనే యాంటీ సెప్టిక్ సబ్బుతో చేతులు కడుక్కోవాలని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

అమరావతి: మండల పరిధిలోని మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు, ఎంపీపీ మేకల హనుమంతరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్లలో మునుగోడులో రూ. 4కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మేకల శివశంకర్, షేక్ షరీఫ్, బీజేపీ నాయకులు నేలపాటి జయకుమార్, గణపా వెంకట్రామిరెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వరరావు, బంకా బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం దోపిడీ

పెదకూరపాడు : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో వినియోగదారులపై రూ. 15485 కోట్ల భారాన్ని మోపిందని అరసం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతిశ్రీ విమర్శించారు. పెదకూరపాడులోని సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ చార్జీలు పెంపుకు నిరసనగా శనివారం ధర్నా నిర్వహించారు.విద్యుత్ సిబ్బందికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జ్యోతిశ్రీ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ , నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి షేక్ నాగుల్ మీరా పాల్గొన్నారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలి

నకరికల్లు: మొహర్రం వేడుకల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ హెచ్చరించారు. మండలంలోని గుండ్లపల్లిలో ప్రజలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీర్ల పండుగ వేడుకల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా పెడతామని చెప్పారు. పీర్ల ఊరేగింపులో ఆకతాయి పనులు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్నేహభావంతో, ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

నకరికల్లు: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక భగత్‌సింగ్ ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేసే హక్కును కాలరాసే లేబర్ కోడ్‌లను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1992లో సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకొని కనీస వేతనం రూ20వేలుగా నిర్ణయించి, అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు, సీపీఎం సీనియర్ నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి, సీఐటీయూ మండల నాయకులు గోదా వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో...

కష్టజీవుల హక్కులను హరించే చట్టాలను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టబోయే సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

అచ్చంపేట: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటికి నాలుగుసార్లు విద్యుత్ బిల్లులు పెంచి సామాన్యుడిపై భారం మోపుతోందని సీపీఐ మండల కార్యదర్శి షేక్ మస్తాన్ బుజ్జి అన్నారు. విద్యుత్ బిల్లులు పెంపుకు నిరసనగా శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. లైన్‌మన్ జ్ఞానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ మస్తాన్ మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో ఇప్పటికి నాలుగు విడుతలుగా సామాన్యునిపై రూ.15,485 కోట్ల భారం మోపిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అచ్చంపేట గ్రామ కార్యదర్శి సంపంగుల ఏడుకొండలు, బండారు శ్రీనివాసరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మధు పాల్గొన్నారు.

రుణాల గోల్‌మాల్‌లో రైతులకు న్యాయం చేస్తాం

దొడ్లేరు (క్రోసూరు): దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో గోల్డ్ లోన్ బాధిత రైతులతో శనివారం జనరల్ మేనేజర్ జుమ్మేలాల్, రీజినల్ మేనేజర్ సుభాష్ చర్చించారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఇంకా 97 మంది బాధితుల సమస్య పరిష్కారం కావాల్సి ఉందని తెలిపారు. జూలై 8, 9,10 తేదీల్లో సీఐతో విచారణ చేయించి నెలాఖరిలోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ బ్యాంకు మీద గౌరవంతో పెండింగ్‌లో ఉన్న ఖాతాలకు సైతం వడ్డీ చెల్లిస్తున్న ఖాతాదారులపై నిర్లక్ష్యం వైఖరి సరికాదని తెలిపారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రావెళ్ల వెంకటేశ్వర్లు, ఆవుల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: జనసంఘును స్థాపించి ఆధునిక హిందుత్వ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించిన దేశ భక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి-1 ఏ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మేరా యువ భారత్ గుంటూరు (మై భారత్) సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత దేశ రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు ముఖర్జీ అని కొనియాడారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసంఘుతో దేశంలో తొలి హిందూ వాద రాజకీయ పార్టీని స్థాపించిన మహోన్నత వ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దేశ విభజనను వ్యతిరేకించిన వారిలో శ్యాంప్రసాద్ ముఖర్జీ ముఖ్యుడని తెలిపారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ సంతోషమ్మ మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జన్మదినోత్సవం సందర్భంగా రెండవ వార్డు అంగనవాడీ సెంటర్‌లో మొక్కలు నాటడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న రామ్ విలాస్ పాశ్వాన్



పాశ్వాన్ చిత్రపటానికి నివాళ్ళులర్పిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

సత్తెనపల్లి: భారత రాజకీయాల్లో రామ్ విలాస్ పాశ్వాన్ ఐదు దశాబ్దాలుగా చెరగని ముద్ర వేసుకున్నారని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు. రామ్ విలాస్ పాశ్వాన్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. న్యాయ శాస్త్రం చదివిన పాశ్వాన్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఎనిమిది సార్లు లోక్ సభకు, ఒకసారి రాజ్యసభకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అనంతరం పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమపాఠశాలలో అన్న సంతర్పణ, మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారుమంచి గంగరాజు, షేక్ షరీఫ్, సుభాని, నలబోలు ప్రసన్న రాజా, మహంకాళి వెంకటరావు, రత్తయ్య, కంభంపాటి ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఉత్తమ పౌర సమాజ నిర్మాణమే లక్ష్యం

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రత్యూష సుబ్బారావు



సభలో మాట్లాడుతున్న ప్రత్యూష సుబ్బారావు

సత్తెనపల్లి: ఉత్తమ పౌర సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు నేటి సమాజానికి అవసరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. సత్తెనపల్లిలోని ఎన్ఎస్పీ కెనాల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా 18వ మహాసభలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ నేటి సమాజానికి జన విజ్ఞాన వేదిక ఆవశ్యకత ఉందని తెలిపారు. ప్రధానంగా మూఢ నమ్మకాలను నిర్మూలించడానికి, ప్రజలకు సైన్స్ ఫలాలు గురించి తెలియజేయడం అవసరమని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ జిల్లాలో ఈనెల 12, 13వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రైతు సంఘం కార్యదర్శి బత్తుల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలమారెడ్డి, సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్‌బాబు, జన విజ్ఞాన వేదిక గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వి.రావు, పల్నాడు జిల్లా నాయకులు ఎస్.ఎం సుభాని, సేతు రామేశ్వర్‌రెడ్డి, కె.ప్రేమకుమార్, ఎం. అప్పారావు, కంబాల ఆనంద్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

పెదకూరపాడు : గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9 నుంచి సమ్మె చేయనున్నట్లు శనివారం తహసీల్దార్ ధనలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ వీఆర్‌ఏలకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం జీతాలు, సకాలంలో ప్రమోషన్లు, అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో మరణించిన వీఆర్‌ఏ కుటుంబానికి రూ. 10 లక్షలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఖాసిం, రామకృష్ణ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

సత్తెనపల్లి: అరుణాచలానికి ఈ నెల 8న రాత్రి 9 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ (2+2 పుష్ బ్యాక్) బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ సత్తెనపల్లి డిపో మేనేజర్ జీఎస్‌వీ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదే రోజు రాత్రికి అరుణాచలం చేరుతుందని పేర్కొన్నారు. దర్శనం అనంతరం తిరిగి 10న కంచి చేరుతుందని, దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలుదేరి ఈనెల 11న ఉదయం సత్తెనపల్లి వస్తుందని వివరించారు. టిక్కెట్ ధర రానుపోనూ ఒక్కొక్కరికీ రూ.2,500 మాత్రమేనని తెలిపారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382897583, 7382896966, 7382897116 నంబర్లలో సంప్రదించాలని కోరారు.